కథానిక

# అమృతహస్తం

● తోలేటి జగన్మోహనరావు

● చిత్రాలు: నర్సిం

సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి చేరి, సోఫాలో మా మావగార్ని చూసి ఉలిక్కిపడ్డాను. ఆయనకి అలా హఠాత్తుగా చెప్పా పెట్ట కుండా రావడం అలవాటేగాని, ఆయన్ను చూడగానే నా ఎడం కన్ను అదిరింది. ఆయన మాట తీరూ, వ్యవహారం చూస్తే ఏదో పెద్ద ప్లానుతోనే దిగినట్లనిపించింది.

'ఎందుకొచ్చాడు మీ నాన్న?' అన్నాను మా ఆవిడతో.

'ఆ ప్రశ్నేవిటీ - నన్ను చూడ్డానికి వచ్చారు.'

'మరి నా కూడా తిరుగుతాడెందుకు?'

'అల్లుడన్న అభిమానంతో' అంది మా ఆవిడ వెటకారంగా.

మా ఆవిడ మా మావగారి ఏకైక పుత్రిక. ఇంకెవరూ సంతానం లేరు. అంచేత ఆవిణ్ణి చూడ్డానికి వస్తే వచ్చుండొచ్చుకాని, అల్లుడిగాణ్ణి చూడ్డానికి వచ్చాడన్నమాట అభూతకల్పనే. ఎందుకంటే, ఆయనకీ, నాకూ అసలు పడదు. ఎడమొహం, పెడమొహంగా ఉంటాం. అంతకంటే సీరియస్ విషయమేవిటంటే, ఆయన వస్తూ, వస్తూ సంచీనిండా దొండకాయలు తీసుకు రావడం.

దొండకాయలు మీకు వట్టి కూరగాయలే కావచ్చు కానీ, మా మావగారు నాకోసం మోసుకొచ్చారంటే, దొండకాయలు బాంబులంత ప్రమాదకరమైనవి. ఎంచేతంటే, మా మావగారికి దొండకాయంటే అసహ్యం. దొండకాయను మనుషులు తినడమేవిటి అని ఆశ్చర్యపోతారు. దొండకాయలు లక్షలమంది తింటారని, నాలాంటి వేలమందికి ఇష్టమని ఎవరైనా అంటే ఆయనకు కట్టుకథ కింద కనిపిస్తుంది.

పెళ్ళయిన కొత్తలో మా ఆవిడ నాకిష్టమని దొండకాయవేపుడు చేస్తే - "ఏవిటే మీ ఆయన — వింత మనిషి. దొండకాయ ఇష్టమేవిటే" అని సణిగారు నేను వినలేదనుకుని.

'దొండకాయలు తిననప్పుడు పాదెందుకు పెట్టారు?' అనడిగాను నేను.

'నేను పిచ్చాణ్ణా పాదు పెట్టడానికి. దానంతటదే వచ్చింది. నే ఛస్తే ముట్టు కోను. పక్కింటివాళ్ళ గేదొచ్చి అప్పుడప్పుడు తినిపోతుంది. ఇదిగో, ఇప్పుడు మీరు...." అన్నారాయన మొహం అదోలా పెట్టి. అలాంటి మనిషి ఏ దురుద్దేశం లేకుండా దొండకాయలు ఇంతదూరం మోసుకొచ్చాడంటే నాకు నమ్మ బుద్ధి కాలేదు.

రాత్రి భోజనాలయ్యాక 'ఏవిటోయ్ - స్టాక్ మార్కెట్లో బాగా సంపాదించేవుట. ఎంత సంపాదించావేవిటి?" అనడిగారు యాథాలాపంగా అడిగినట్లు - ఆ కబురూ ఈ కబురూ చెబుతూ.

మా మావగారికి విజయవాడలో ఇల్లుంది. బ్యాంకు బ్యాలన్సుంది. ఒంటరి మనిషి. ఆయన చూపు నా జేబు మీద పడే ప్రమాదమేమీ లేదు. అంచేత ధైర్యంగా, గొప్పగా సమాధానం చెప్పాను - 'ఓ యాభై...'

'వేలా - లక్షలా?'

'లక్షలే.'

ఆ మాట వినగానే ఆయన కాళ్ళు నేల మీద నిలవలేదు. 'అయితే, అంతా అనుకునేది నిజమేనన్న మాట' అన్నారు అలా గాల్లో తేలుతూ. మన ఖ్యాతి కృష్ణా, గోదావరీ తీరాలకు వ్యాపించిందన్న విషయం నాకు అంతవరకూ తెలియదు.

'నూటికి నూరుపాళ్ళూ - నేను మీ అల్లుడూ, మీరు నా మావ అయినంత నిజం' అన్నాను ఇంకొంచెం గొప్పగా.

ఆయన ఇంకేం మాట్లాడలేదుగాని, నా వెనకాల నీడలా గదిలోకి వెడితే గదిలోకీ, హాల్లోకి వెడితే హాల్లోకి, బాల్కనీలోకి వెడితే బాల్కనీలోకి వెంటాడడం మొదలుపెట్టారు.

'మీ నాన్న నన్ను మర్డరు చేసి ఏభై లక్షలు తీసుకుపోదామని ప్లానేస్తున్నాడేవిటి' అన్నాను మా ఆవిడతో - అతికష్టం మీద ఆయన్ను వదిలించుకుని, పడకగదిలో దూరి తలుపు గడియపెట్టి.

'ఆయనకేం మహారాజు - ఆయనకి మీ డబ్బు అవసరం ఏవుంది?'

'అవసరమని కాదు. ఏభై లక్షలనగానే మతి చలించి అల్లుణ్ణి మర్డరు చెయ్యాలని సరదా పుట్టిందేమోనని...'

'మా వంశంలో పిచ్చి ఎవరికీ లేదు - మీకే వేపకాయంత ఉందేమో. ఇలాంటి ఆలోచనలు సామాన్యులకి రావు.' చికాగ్గా అంది మా ఆవిడ.

కారణమేవిటో తెలియదుగాని ఆయన చూపు నా ఏభై లక్షల మీదా పడిందన్న విషయం నాకు స్పష్టమైంది. ఈయన ఏ గుర్రప్పందేల్లోనో, పేకాటలోనో ఉన్న ఆస్తంతా తగలేసి అప్పులపాలైపోలేదు కదా అనే భయం కూడా పట్టుకుంది. సరే - విషయం ఆయనే చెబుతారు కదా అని నేనూ అడగకుండా ఊరుకున్నాను.

మర్నాడు రాత్రి భోజనాలయ్యాక రెండో అంకం మొదలైంది. 'నాకు కూతురైనా, కొడుకైనా నువ్వే' అని మా ఆవిడతో అని, 'నాకు అల్లుడైనా, కోడలైనా నువ్వే' అని నాతో అని, 'ఆస్తికి వారసులు మీరే....' అన్నారు.

'అప్పులకి' అన్నాను - విషయం స్పష్టం చేసుకోవాలి కదా.

'మీరు నోరు మూసుకుంటారా?' సాధ్యమైనంత మృదువుగా అంది మా ఆవిడ.

'నాకు అప్పులేం లేవు. జీవితంలో అన్నీ చూశాను. అనుభవించాను. ఇంకే కోరికలూ లేవు...' కేన్సరుతో తీసుకుంటూ, ఆఖరి గడియలు వచ్చేశాయని తెలిసి, కండువా భుజం మీద వేసుకుని, దగ్గుతూ, గుండెలు రుద్దుకుంటూ, స్టీలు అలమైరా దాకా వెళ్ళి అది తెరిచి విల్లుకాగితాలు తీసి, అల్లుడి చేతిలో పెట్టే సీనులా ఉంది - '...ఒక చిన్న కోరిక మిగిలిపోయింది - ఒక్క సినిమా తీసి చచ్చిపోవాలనుంది...' అన్నారు.

నా స్టాక్‌మార్కెట్ విజయాల గురించి చెబుతూ మీకు ఇదివరకోసారి చెప్పాను - గుర్తుందో లేదో! మా మావగారు పాతిక ముప్పయ్యేళ్ళ క్రితం అందాలతార రాజశ్రీ, కత్తియుద్ధాల కాంతారావు, ఆంధ్రుల అభిమాన విలన్ రాజనాలగార్లతో 'అమృతహస్తం' అనే మహత్తర జానపద చిత్రరాజం మొదలుపెట్టి, ఆరు రీళ్ళు తీసి చేతులెత్తేశారు. ఆ రీళ్ళు ఇప్పటికీ మావగారింట్లో అటక మీద భద్రంగా ఉన్నాయి. పదహారేళ్ళకాలమైనా, ముసలితనం మీద పడ్డా, ఆయన సినిమా కోరిక చావలేదన్నమాట. ఇంక అమ్మడానికి పొలమేమీ లేదు. ఆయన దగ్గరున్నది ముహూర్తం పాటుకి సరిపోదు.

'ఎలా తీస్తారు? ఉన్నదంతా అప్పుడే అమ్మేశారు కదా. ఇంక డబ్బెక్కణ్నుంచి వస్తుంది?' - నా బుర్రలో ఇంకా లైటు వెలగలేదు.

'నీ దగ్గరుంటే నా దగ్గరున్నట్లే కదా. మనిద్దరం జాయింటుగా తీద్దాం. నేను ఐడియాలిస్తాను, నువ్వు డబ్బు పెడుదువుగాని. కావాలంటే టైటిల్సులో నీ పేరే వేయిద్దాం' అన్నారు ఆయన.

సినిమా తియ్యడమనగానే నా గుండె ఒక్కసారి ఎగిరిపడింది. నేనసలే వీర సినిమా అభిమానిని. స్కూలు రోజుల్నుంచీ వారానికి ఏడు సినిమాలు చూసేవాణ్ణి. చిన్నప్పుడైతే సినిమాల్లో హీరోగా వేద్దా మనుకున్నాను. కానీ, పెద్దయ్యాక అంతా 'నువ్వు విలను గేంగులో తన్నులు తినేవాడి రోలుకి కూడా పనికిరావు' అని నిరుత్సాహపరిస్తే యాక్టింగు విషయం వదిలేశాను. సినిమా తీద్దామన్న ఆలోచన అసలింతవరకూ కలగలేదు. మా మావగారు నా బుర్రలో ఆ ఆలోచన నాటగానే క్షణంలో అది మాంత్రికుడి చెట్టులా మహావృక్షమై పోయింది.

'కాని మన దగ్గర ఏభై లక్షలే కదా ఉంటా' అన్నాను నా ఉత్సాహాన్ని అణచిపెడుతూ.

'ఆ విషయం నా కొదిలే. నా స్నేహితుడికొడుకున్నాడు - వాడు కూడా నా సినిమాలో భాగస్థుడు. వాడు కూడా మనతో కలుస్తాడు.'


'ఈ విషయంలో అట్టే అనుభవం లేదు' అన్నాను రెండో అభ్యంతరం చెబుతూ.

'నీకు లేకపోతే నేను లేనూ. ఆరు రీళ్ళ అనుభవం ఉంది. నువ్వు యస్ అను.'

ఇంక ఆగలేక పెద్దగా 'యస్' అనరిచాను. మావగారు ఉలిక్కిపడి గంతేశారు.

'రైలింజను బొంయిమన్నట్టు అలా చెవిలో అరవకు హడిలి చచ్చేలా - మెల్లిగా 'యస్' అను నాకు వినబడుతుంది' అన్నారు.

ఆయన చెవిలో మెల్లిగా 'యస్' అన్నాను.



ఈసారి ఆయన ఆనందంతో ఎగిరి గంతేసి 'అమ్మాయ్ - మీ ఆయనకి దొండకాయ వేపుడు చెయ్యి ఈ రోజు' అని మన స్పెషల్ డిష్‌కి వర్మిషనిచ్చేశారు.

మా మావగారు వెంటనే భాగస్థుడికి ఫోను చేశారు. ఆయన రెండో రోజే ఓ డబ్బా పట్టుకు దిగిపోయారు.

'ఏవిటీ డబ్బా' అన్నాను ఆశ్చర్యపోయి.

'నా వాటా' అన్నారు ఆయన డబ్బాలోంచి రెండు రీళ్ళు తీసి చూపిస్తూ. 'ఆ ఆరు రీళ్ళు మీ మావ వాటా. మీ మావకు బుద్ధి లేదు - ఏవనుకోకు. నిర్మొహమాటంగా, కుండలు బద్దలుకొట్టినట్టు మాట్టాడతాను నేను. సుబ్రంగా ఏ పౌరాణికవేనా తీద్దాంరా, పుణ్యం పురుషార్థంరా అంటే వినక స్వంటు సినిమా తీసి కాళ్ళూ చేతులూ విరగ్గొట్టుకున్నారు' అన్నారు రమణమూర్తిగారు చిటపటలాడుతూ.

భాగస్థులిద్దరూ విడిపోయినప్పుడు ఆయన ఆరు రీళ్ళూ, ఈయన రెండు రీళ్ళూ తీసుకు విడిపోయారు. మావగారి ఫోనందుకుని మొత్తం ఎనిమిది రీళ్ళూ తీసుకువచ్చేశారాయన.

'అమృతహస్తం' ఎలా ఉందో చూద్దావనిపించి ప్రొజెక్టర్ తెప్పించి వేసి చూశాను.

రాజనాలగారు 'శాంభవీ' అంటూ గుహలో ప్రవేశించి 'వందమంది రాకుమార్తెలను బలి ఇచ్చాను దేవీ. నూట ఒక్కటో రాకుమార్తెను త్వరలో బలిచ్చి ముల్లోకాలను జయిస్తా....హ్హా...హ్హా...' అంటూ వికటాట్టహాసం చేశారు.

'నూట ఒక్క రాకుమార్తెలను బలిస్తే ముల్లోకాలు జయించడవేవిటీ?' నాకు సందేహం వచ్చింది. 'కథ రాసిన సన్నాసి నడుగు' అన్నారు రమణమూర్తిగారు చికాగ్గా.

'కథ రాసిన సన్నాసి ఎవడు?'

'మీ మావ.'

తర్వాత రాకుమార్తె వేషంలో రాజశ్రీ ఒక పాట పాడింది. పాట అయిపోతుండగా 'హ్హా....హ్హా' అంటూ రాజనాల ప్రత్యక్షవై ఆమెను ఎత్తుకుపోతుంటే, కాంతారావుగారు ముళ్ళగదలు, త్రిశూలాలు, గొలుసులున్న ఇనపగుళ్ళు, మంటలు కక్కే కత్తులూ - రకరకాల వింత వింత ఆయుధాలతో యుద్ధం చేసి, ఆయన్ని చావగొట్టి, కాళ్ళూ చేతులూ కట్టేసి, ఆయన ఎదురుగానే రాజశ్రీతో ఓ యుగళగీతం పాడేశారు. తర్వాత నాలుగు రీళ్ళలోనూ రెండుసార్లు రాజనాల గార్ని చావగొట్టడం, రెండు యుగళగీతాలు -

'ఇదీ మీ మావ సినిమా' అన్నారు రమణమూర్తిగారు నిరసనగా. 'నయం - ఇది రిలీజు కాలేదు. రిలీజైతే ఎడ్రను వెతుక్కుంటూ వచ్చి మీ మావని చితగ్గొట్టేసేవారు. జనాలు - సినిమా అంటే ఇలా ఉండాలి' అంటూ ఆయన రెండు రీళ్ళు చూపించారు.

ఆయన సినిమాలో ఓ రీలులో రాజశ్రీ, కాంతారావు గార్లు సీతారాములుగానూ, మరో రీలులో లక్ష్మీదేవి, శ్రీమహావిష్ణువుగానూ కనుపించి పద్యాలు, పాటలు పాడేరు. దీనికీ, మావగారి సినిమాకి సంబంధవేవిటో నాకు అర్థం కాలేదు.

'ఓ చిన్న సందేహం - ఆ సినిమా, ఈ సినిమా వేరువేరు సినిమాలా, ఒకటేనా' అనడిగాను బుర్ర గోక్కుంటూ.

'ఒకటే - వజ్జాలూ, పౌరాణిక పాత్రలూ లేనిదే వాడు పెట్టుబడి పెట్టనన్నాడు. అంచేత ఓ కల, ఓ అంతర్నాటకం పెట్టాను కథలో. లేకపోతే సుబ్రంగా ఇంకో రెండు రీళ్ళు కత్తియుద్ధం తీసేవాణ్ణి' అన్నారు మావగారు బాధగా.

'మీ సినిమా అలా ఉంచండి. మన సినిమాకి ఎలా ప్రొసీడవుదాం' అనడిగాను. అనుభవం ఉన్న పెద్దలు కదా!

'ఓం ప్రథమం - మనకు కథ కావాలి' అన్నారు మావగారు.

'నువ్వే రాస్తావా ఈ సినిమాకి కూడా' అన్నారు రమణమూర్తిగారు అనుమానంగా. ఆ అవకాశం మావగారికివ్వకుండా ఆయన మర్నాడే చింతామణి నాటకంలో బిల్వమంగళుడిలా ఉన్న ఓ జులపాల జుట్టు కవిగార్ని పట్టుకొచ్చేశారు. కవిగారు ప్రమీలార్జునీయం, కాంభోజరాజు కథల్లాంటి చిత్రాలకు రాయగలరేమో కాని నేను తియ్యబోయే మహత్తర సాంఘిక చిత్రానికి ఆయన పనికిరాడని నాకు అర్థమైపోయింది.

'ఆయన కథ రాస్తే మన పిక్చరు 1960కి ముందు రిలీజు చెయ్యాలి. అది కుదరదు కాబట్టి మనది సకుటుంబంగా చూసి ఆనందించాల్సిన చిత్రం గనుక సకుటుంబంగా కథ చర్చిద్దాం' అన్నాను?

'అవును. వాళ్ళూ వీళ్ళూ ఎందుకు. మనమే కథ రాద్దాం' అంది మా ఆవిడ ఉత్సాహంగా. 'ఇద్దరు కవలలు - చిన్నప్పుడే విడిపోయారు' అంది కథ ప్రారంభిస్తూ. 'ఇది వెయ్యి సినిమాల్లో ఉంది' అన్నారు కవిగారు జుట్టు పీక్కుంటూ.

'అంటే ఇది ఎవర్‌గ్రీన్ సబ్జక్టన్నమాట. మన సినిమాలో కూడా ఉండి తీరాలి. ఒకడు అడవిలో పెరుగుతాడు. ఒకడు నగరంలో పెరుగుతాడు!' అన్నాను నేను అందుకుంటూ. 'ఇదీ వెయ్యి సినిమాల్లో ఉంది' అన్నారు కవిగారు' మళ్ళీ జుట్టు పీక్కుంటూ.

కథ మెల్లిగా రూపుదిద్దుకొంటోంది.

'హీరోకి ఏక్సిడెంటవుతుంది - ఆకాశంలో వెడుతున్న దేవకన్య హీరోని కాపాడి ప్రేమిస్తుంది' అన్నాడు మా కుర్రాడు. వాడిది నా పోలికే. చదివేది ఎనిమిదో



తరగతేకాని, ఈ వయసులో ఓ సినిమా డైరెక్టు చెయ్యగలిగిన మేధ వాడిది.

'ఆంజనేయస్వామివారు విలన్తో క్లయిమేక్స్ సీన్లో ఫైటు చేస్తారు. తోకతో విలన్ విమానాన్ని పైకెగరకుండా ఆపుచేస్తారు...' అన్నారు మావగారు హుషారుగా. స్టంటుసీన్లు రాయడంలో ఆయనకి ఆయనే సాటి.

'రామ రావణయుద్ధం అయ్యాక హనుమంతుడు పనిలేక సినిమాల్లో ఎక్స్ట్రా రోల్స్ వేస్తున్నాడా?' అన్నారు రమణమూర్తిగారు వెటకారంగా.

రెండు గంటల చర్చ తర్వాత కథ పూర్తిచేసి లేవబోతుంటే, 'నాకో ఆరడుగుల తాడిప్పిస్తారా' అనడిగారు చివరన కూర్చున్నాయన నీరసంగా. ఈ బట్టతలాయన ఎవరో, ఎందుకొచ్చారో నాకు అర్థం కాలేదు.

'ఎవరు మీరు' అనడిగాను ఆశ్చర్యంగా.

'నేనే కవిగాణ్ణి.'

'అదేవిటి - జులపాలజుట్టు....'

'మీ కథ విని జుట్టు పీక్కుని ఇలా అయిపోయాను. ఆరడుగుల తాడిప్పించండి. ఉరేసుకు ఛస్తాను' అన్నాడాయన దుఃఖంగా.

గొప్ప రచయితలతో వచ్చిన చిక్కే ఇది. రాట్నం మీద ఈగ తన మూలానే రాట్నం తిరుగుతోంది అనుకుంటుందట. ఈ కవులు కూడా అంతే. సినిమాకి తమ కథ ముఖ్యమనుకుంటారు. కథా కాకరకాయ ఏవీలేని వందల సినిమాలు రజతోత్సవాలు చేయించుకున్నా వీళ్ళకి అర్థంకాదు.

కథ, స్క్రీన్ప్లే, సంభాషణలు పూర్తిచేసి, 'ఇప్పుడు పాటలు రాయిద్దాం' అన్నాను నేను ఉత్సాహంగా.

'నీదంతా తలకిందులు వ్యవహారంలా ఉంది. అసలు డైరెక్టరు లేకుండా ఇవన్నీ ఏవిటి' అన్నారు రమణమూర్తిగారు.

'మనవే అంతా తయారుచేసి డైరెక్టరుకిద్దాం. డైరెక్టరు చేసేదేవుంది?' అన్నాను.

'మావకి తగ్గ అల్లుడివి దొరికావు - ఖర్మ' అన్నారాయన తలకొట్టుకుంటూ.

'ఎవరిచేత రాయిద్దాం పాటలు' అన్నారు మావగారు.

'ఇంకెవరు - వన్ అండ్ ది ఓన్లీ వన్ బూతుల అప్పారావు' అన్నాను నేను.

అప్పారావు, నేనూ కలిసి చదువుకున్నాం. ఆ తర్వాత వాడు సినిమాల్లో చేరి సినిమా పాటల రచయితగా పెద్ద పేరు తెచ్చుకున్నాడు. వాణ్ణిప్పుడు అంతా బూతుల అప్పారావని అభిమానంగా పిలుస్తారు.

'ఒరే, నా సినిమాకి పాటలు రాసి పెడతావా' అనడిగాను.

'ఏ వన్ సూపర్హిట్ పాటలు రాస్తా. ముందు కొంచెం మూడ్రానీ' అంటూ మందుసీసా తీశాడు.

'అప్పారావు సినిమా పాటలు రాస్తున్నాడు. ఆడవాళ్ళూ, పిల్లలూ ఇంట్లో ఉండకూడదు - వెళ్ళిపోండి' అని మా ఆవిణ్ణీ, పిల్లాడిని తరివేశాను. మా మావగారూ, రమణమూర్తిగారూ, నేనూ మిగిలాం.

అప్పారావు సీసా మూత తీసి లాగించడం మొదలుపెట్టాడు. సగం ఖాళీ అయ్యేటప్పటికి నిషా అందుకుంది గురుడికి. లేచి మావగారి ఎదురుగా నిలబడి, బల్లమీద గట్టిగా గుద్ది, 'ఏవంటావ్' అనడిగాడు కళ్ళెర్రజేసి.

'ఏవిటేవనడం' అన్నారు ఆయన ఉలిక్కిపడి.

'నే బూతుల అప్పారావునా?'

'అదేకదా నీ పేరు?' - అన్నారు ఆయన టాక్ట్లెస్గా.

'ఎవడు చెప్పాడు నీకు?'

మావగారు నాపేరు చెబుతారేమో, అప్పారావుగాడి చేత తన్నులు తినాల్సొస్తుందని కంగారుపడి, పెన్నూ కాగితాలు తీసుకురమ్మని ఆయన్ని లోపలికి తరిమేశాను.

అప్పారావుకి ఎందుకనో మావగారంటే మొదటి చూపులోనే అయిష్టత ఏర్పడింది. 'ఎవడీ ముసలి బావురుపిల్లి' అన్నాడు మావగారు వెళ్ళినవైపే తీవ్రంగా చూస్తూ.

'మా మావగారు.'

'మీ మావగారంటే నా కిష్టం లేదు.'

'ఎందుకని?'

'నాకు బావురు పిల్లులంటే ఇష్టం కాదు.'

అప్పారావు మళ్ళీ సీసా అందుకున్నాడు. 'బూతుల అప్పారావుట - ప్రబంధాల్లో బూతుల్లేవా? పండితుల కర్థవయ్యేలా బూతులు రాయడం తప్పు కాకపోతే, పామరులకి అర్థవయ్యేలా పచ్చిబూతు రాయడం తప్పెలా అవుతుంది. నేను ప్రజాకవి పెద్దనని - బూతుల అప్పారావుట - అంతా ఛీ..ఛీ... అనేవాళ్ళే - అంతా శ్రీవైష్ణవులే కాని బుట్టలో రొయ్యలు.... రొయ్యలనగానే అప్పారావుగాడి దృష్టిలో లోపల్నుంచి పెన్నూ కాగితాలూ తీసుకొస్తున్న మావగారి బారెడు మీసాల మీద పడింది.

'నాకు రొయ్యలంటే ఇష్టం కాదు' అన్నాడు వాడు ఆయన దారికి అడ్డు నిలబడి, ఆయన మీసాలకేసి తీవ్రంగా చూస్తూ.

ఆయనకి వాడు మాట్లాడుతున్నదేవిటో అర్థం కాక తెల్లమొహం వేశారు.

'నాకు బావురు పిల్లులంటే ఇష్టం కాదు' అన్నాడు అప్పారావు ఇంకొంచెం గట్టిగా.

'బావురు పిల్లులు, రొయ్యలు నీకిష్టం కాకపోతే నన్నేం చెయ్యమంటావ్?'

'బావురు పిల్లులు, రొయ్యలు నా కంటపడితే ఏం చేస్తానో తెల్సా?'

'ఏం చేస్తావ్?'

'తుపాకీతో.... ఢాం...ఢాం.... అని పేల్చేస్తా.'

'పేల్చేయ్. పీడ విరగడైపోతుంది' అన్నారు మావగారు విసుగ్గా, రానున్న ప్రమాదం గుర్తించక.

'పేల్చేమంటారా?' అన్నాడు అప్పారావు పెన్ను పిస్టల్లా పట్టుకుని గురిచూస్తూ.

'పాటా లేదు - పాడూ లేదు. ఈ బావురు పిల్లులు, రొయ్యల గోలేవిటయ్యా' అని తల పట్టుకుని కుర్చీలో కూలబడిపోతున్న మావగార్ని లేవదీసి, మళ్ళీ లోపల గదిలోకి పంపించేసి, పిలిస్తే కాని రావద్దని హెచ్చరించి, అప్పారావుని శాంతింపచేసి, పెన్నూ కాగితాలు ఇచ్చి, 'పాట రాయరా బాబూ' అని బతిమాలాను.



'ఏ పాట?'

'సినిమా పాట.'

'సినిమా పాటేలే - కథ, నందర్భం, సీను ఏవిటి? నన్నివేశానికి తగినట్లు పాటరాయాలి గదా.'

'పాట రాయడానికి సీనెందుకు గురూ! బాబ్డ్ హెయిర్ చిన్నది, 'నా వాలుజడలో మల్లెపూలు...' అనీ, స్కర్టు వేసుకున్న హీరోయిన్, 'ఎగిరే నా పైట...' అని ఎన్ని సినిమాల్లో పాడలేదూ - నువ్వు లాగించు....'

'పైట అనగానే బ్రహ్మాండమైన మూడొచ్చేసింది - ఓ పడవ పాట రాస్తా. కావాలంటే క్లబ్బులో పిక్చరైజు చేయించు.'

'రాయి.'

అప్పారావు సీసా పూర్తిచేసి, కలం పుచ్చుకుని మూడు లైన్లు గీకి పడేశాడు. 'పైరు గాలొచ్చి పైట లేపింది - కొండ గాలొచ్చింది కోక లేపింది, మావా.....'

'ఏవిటీ పాట - కొంచెం ఇబ్బందిగా ఉంది వినడానికి' అన్నారు రమణ మూర్తిగారు నా చెవిలో మెల్లిగా. రెండు నిమిషాల్లో అప్పారావు పాట పూర్తిచేసి 'ఇంక... నే వెళ్ళి... ర్రానా...' అన్నాడు.

'ఇంకో పాట రాయాలి - వేంకటేశ్వరస్వామి మీద. హీరోయిన్ హీరోని రక్షించమని పాడుతుంది - ఇంకో సీసా తెప్పించనా?'

'త...తప్పు... తప్పు' - లెంపలేసుకుని స్వామివారికి నమస్కరిస్తూ అన్నాడు, 'మ.. మజ్జిగ తెప్పించు...'

'మీ మావ ఆంజనేయస్వామి వచ్చి ఫైటింగ్ చేస్తాడని చెప్పాడు కదా. నువ్వేంటి వెంకటేశ్వరస్వామి మీద పాట రాయిస్తున్నావు' అన్నారు రమణ మూర్తిగారు తలగోక్కుంటూ.

'హీరోయిన్ వేంకటేశ్వరస్వామినే ప్రార్థిస్తుంది. ఆయనకి తీరిక లేక ఆంజనేయ స్వామివారిని పంపిస్తారు ఫైటింగుకి.'

మూడు గ్లాసుల మజ్జిగ తాగి ఏడవడం మొదలు పెట్టాడు అప్పారావు.

'ఎందుకురా బాబూ ఏడుస్తున్నావు?' అనడిగారు రమణమూర్తిగారు కంగారుపడి.

'వాడు భక్తిపాటలు రాసే మూడ్ తెచ్చుకుంటున్నాడు. వాణ్ణి డిస్టర్బు చెయ్యకండి' అన్నాను నేను.

'ఎలాంటోణ్ణి ఎలా అయిపోయాను' - అప్పారావు ఏడుస్తూ మొదలుపెట్టాడు.

'మందార మకరంద మాధుర్యమున దేలు లాంటి అందమైన వజ్జాలు రాసినోణ్ణి. ఇవాళ బూతుల అప్పారావునైపోయాను.'

'భాగవతం నువ్వు రాశావా?' - రమణమూర్తిగారు తెల్లబోయి అడిగారు.

'నేనే - బమ్మెర పోతన పేరెప్పుడూ విన్లేదా?'

'వీడి వ్యవహారం చూస్తే భారతం కూడా నేనే రాసేననేట్లున్నాడు' అన్నారు రమణమూర్తిగారు.

'లేకపోతే - మీరు రాశారా?' - అని అప్పారావు ఆయనతో పోట్లాట పెట్టుకోబోతుంటే శాంతింపచేసి మళ్ళా కూర్చోబెట్టాను. వాడు పాట పూర్తిచేసి మళ్ళీ సీసా అందుకున్నాడు. ఇంక వీణ్ణి పంపించెయ్యడం మంచిదని టాక్సీ పిలిపించాను.

'బెస్టాఫ్ లక్ - నీ పిక్చరెల్లా ఏడ్చినా మన పాటకి ఆడుతుంది వందరోజులు గారంటీ - గుర్నాధాన్ని మ్యూజిక్ డైరెక్టరుగా పెట్టుకో. చాకులాంటాడు. చవకలో చేస్తాడు. అన్నట్లు మీ మావగారేరీ' అన్నాడు అభిమానంగా.

'అప్పారావు వెళ్ళిపోతున్నాడు' అని కేకేశాను. మావగారు హడావిడిగా లోపల్నుంచి పరిగెట్టు కొచ్చారు వీడ్కోలు చెప్పడానికి. ఆయన కంట పడగానే అప్పారావు మూడ్ మళ్ళీ మారిపోయింది. రెండడుగులు ముందుకేసి, ఆయన ఎదురుగా నిలబడి, మొహంలో మొహం పెట్టి చూస్తూ, 'నాకు బావురు పిల్లులంటే ఇష్టం కాదు' అన్నాడు సీరియస్‌గా.

'ఇది చెప్పడానికా నన్ను పిలుస్తా' అన్నారు మావగారు తెల్లబోయి.

'ఇంకోటి కూడా చెప్పాలి.' అప్పారావు ఆయన మీసాలకేసి కన్నార్పకుండా చూస్తూ అన్నాడు, 'నాకు రొయ్యలంటే ఇష్టం కాదు.' అప్పారావుని బలవంతంగా టాక్సీలోకి గెంటి తలుపేసేశాను. టాక్సీ కదులుతుంటే వాడు అద్దం కిందికి దింపి తల బయటికి పెట్టి అరిచాడు 'రొయ్య మీసాల బావురు పిల్లుల్ని.... టుపాకీతో...... ఢాం.... ఢాం.....'

'గొప్పవాడే దొరికాడు నీకు' అన్నారు మావగారు తలపట్టుకుంటూ.


'అతని కంటె ఘనుడు.. గుర్నాధం పూర్వాశ్రమంలో - సంగీత దర్శకుడిగా అవతరించక ముందు - గిన్నెలకు మాట్లేసేవాడుట. ఈస్టు, వెస్టు - రెండూ కలిపేసి బెస్టు ట్యూన్లు తయారు చేస్తాడట. సుత్తి తీసుకుని ఇంట్లో గిన్నెలు, పళ్ళేలూ, డబ్బాలూ మోగిస్తూ ట్యూన్‌లు వినిపించాడు. ఆ ట్యూన్లు విని రమణమూర్తిగారు పిచ్చికోతిలా గంతు లేశారు. మావగారు ఆస్ప్రిన్ మాత్రల కోసం పరిగెట్టారు. మా కుర్రాడు మాత్రం టేబులెక్కి పొత్తి కడుపుమీద చెయ్యేసి, పిర్రలు కదుపుతూ, మైఖేల్ జాక్సన్‌లా డాన్సు చెయ్యడం మొదలుపెట్టాడు.

'శిశుర్వేత్తి, పశుర్వేత్తి అన్నారు - అందుకనే' అన్నాడు గుర్నాధం మా కుర్రాడి డాన్సు చూసి ముచ్చటపడి.

'మొదటిదేమోకానీ మీ సంగీతం రెండో కేటగిరీకి బాగా నచ్చుతుందిలెండి' అన్నారు రమణమూర్తిగారు.

అప్పారావుగాడూ, గుర్నాధం అలా అదరగొట్టడంతో నా మీదా, నా స్నేహితుల మీదా మావగారికీ, రమణమూర్తిగారికీ అంత మంచి అభిప్రాయం ఏర్పడినట్లు కనుపించలేదు. దర్శకుడి విషయంలో నన్ను సంప్రతించకుండానే ఓ ఆర్టు ఫిల్ము డైరెక్టరుగారిని తోలుకొచ్చేశారు ఇద్దరూ.

ఆయన పైజామా లాంటి పాంటూ, లాల్చీలాంటి చొక్కా వేసుకున్నాడు. ఆయన చొక్కాకి నంచీ అంత జేబుంది. ఆ జేబునిండా కాగితాలూ, పెన్నులూ, పెన్సిళ్ళూ కుక్కాడు. మెళ్ళో నల్లపూసల గొలుసుకి కళ్ళ జోడు వేళ్ళాడుతోంది. ఆయన కళ్ళు రాబోయే ఎవార్డుల గురించి కలలు కంటున్నట్లు ఎక్కడో దూరతీరాలకు చూస్తున్నాయి.




ఈయన తీసిన సినిమా చూశాను. అందులో ఓ పది డైలాగులుంటాయేమో. హీరో లారీ నడుపుతుంటాడు. ఓ చిన్నపల్లెలో, రావిచెట్టుకిందున్న ఓ బడ్డీ కొట్టు దగ్గర లారీ ఆపి టీ తాగుతుంటాడు. వాడు ట్రిప్పులో వచ్చినప్పుడల్లా హీరోయిన్ టీ కలిపి తీసికొచ్చి వాడికిస్తుంది కళ్ళల్లోకి చూస్తూ. వాడు హీరోయిన్ కేసి చూస్తూ కప్పు టీ చప్పుడు చేస్తూ ఓ రీలంతా తాగుతాడు. అలా ఆరేడు రీళ్ళు చప్పరించేశాకా వాడి లారీ ఓ రోజు కొండమీంచి బోల్తా పడిపోతుంది. హీరోయిన్ టీ కప్పు పట్టుకుని రావిచెట్టు కింద అలాగే నిలబడి ఉంటుంది. క్లోజప్పులో టీ కప్పు తెరంతా కనుపించి, మెల్లగా లాంగ్ షాట్లోకి మారిపోతుంది. ఆ తర్వాత అంతా నిశ్శబ్దమైపోతుంది - అదీ సినిమా.

ఆ సినిమాకి అమెరికాలోనో, ఎక్కడో ఏదో అవార్డు వచ్చిందట. వాళ్ళకి మన దరిద్రం చూడడం సరదా అని నా ఉద్దేశం. మన పెంటకుప్పలు, పేడతట్టలు చూసి 'ఆహా - ఎంత ఆర్టిస్టిక్‌గా తీశారు దరిద్రాన్ని' అని సంతోషించి అవార్డిచ్చేస్తారు వాళ్ళు. అంత కళాత్మక హృదయంతోనూ హత్యలు, ఆత్మహత్యలు, యుద్ధాలు, టీవీలో - లైవ్ - చూస్తారట వాళ్ళు.

వాళ్ళ సంగతలా ఉంచి, ఇక్కడ ప్రేక్షకుడికి వాడిచ్చే పది రూపాయలకి విందుభోజనం లాంటి వినోదం - అందమైన అమ్మాయిలు, అబ్బాయిలు, డాన్సులు, పాటలు, సెక్సూ, ఫైట్లూ - ఆల్ ఇన్ వన్ ఎంటర్‌టెయిన్‌మెంటు కావాలి. అజీర్తి చేస్తే అల్లపురసం తాగినట్లు మయమయాన శంకరాభరణం లాంటి సినిమాలు కూడా చూస్తాడు కాని, వాడు సినిమాకి వచ్చేది రెండుగంటల రంగుల కల కోసం. అల్లాంటి వాడి దగ్గర పదిరూపాయలు కొట్టేసి, ఆర్టు పేరుతో బోరేస్తే అది ఎటువంటి హింసాత్మక విప్లవాలకు దారి తీస్తుందో ఆర్టు ఫిల్ము డైరెక్టరు గారికి తెలియక పోయినా, హాలు మేనేజరుగారికి తెలిసొచ్చింది ఆరోజు.

'సమాప్తం' అని రాకుండా లైట్లు వెలిగితే - గంట సినిమాయే కదా అవుతా, ఇంటర్వెల్లనుకుని, జనాలు టీ తాగొచ్చి మళ్ళీ కూర్చున్నారు. ఆపరేటరు డబ్బా బోర్లించి చూపించి, 'సినిమా అయిపోయింది' అన్నాడు. 'రెండు గంటల సినిమాకి డబ్బులు తీసుకుని గంటలో పొమ్మంటే కదిలేది లేదు. వాడొచ్చి ఇంకో ఆరుకప్పుల టీ తాగితే కాని కదలం' అన్నారు జనం మొండిగా.

ఆ హాలు మహారాజపోషకుడిగా మేనేజరుతో నాకు బాగా పరిచయం ఉంది. సినిమా అయి పోయాకా మేనేజరు ఆఫీసులో టీ తాగుతూ సినిమా మంచిచెడ్డలు - మంచేవిటి నా తలకాయ ఆ సినిమాలో - మేనేజరుతో చర్చిస్తున్నాను ఆ సమయంలో. ఆయన మన అభిప్రాయాలకు చాలా విలువిచ్చి గౌరవిస్తాడు.

బయటగోల జరుగుతుంటే, ఏవిటో అని మేనేజరు లేచి బయటకు వెళ్ళి 'లారీ బోల్తాపడి హీరో చచ్చిపోయాడు కదా - చచ్చిపోయినవాడు టీ ఎలా తాగుతాడు' అన్నాడు.

'చచ్చిపోయినవాడు టీ తాగడా?' అనడిగారు జనం అమాయకంగా మొహం పెట్టి.

'తాగడు.'

'అయితే, ఈ కప్పు టీ అలాగే ఉండిపోతుంది' అన్నారు జనాలు శాంతి యుతంగా మేనేజరు చేతిలోని కప్పు అందుకుని గోడమీద పెట్టి. మేనేజరుకి జనవంటున్నదేవిటో మొదట అర్థం కాలేదు కాని అర్థమైనాకా, 'నరసింహం గారండోయ్' అని పెద్ద కేకేసి నా దగ్గరకు పరిగెట్టుకొచ్చాడు.

'నరసింహంగారూ - జనం హాలు అంటించేసేట్లున్నారు- ఏం చెయ్యమంటారు - పోలీసుల్ని పిలుద్దామా' అన్నాడు కంగారుగా.

'పోలీసులొద్దు' - నరసింహంగాడిది పీనట్ బ్రెయినని అంతా అనుకుంటారు కానీ, మన బుర్ర ఒకోసారి పాదరసంలా పరిగెడుతుంది. 'పక్క హాల్లో ఇంగ్లీషు సినిమా ఆడుతోంది. వాళ్ళ దగ్గర రాబోయే సినిమా ట్రెయిలర్లు - యమా హాట్ సీన్లున్నవి అరడజనున్నాయి. అవి తెప్పించి చూపించండి - ఈలోగా సబ్బులు లాగించండి - జనం సంగతి నే చూస్తాను' అన్నాను లేస్తూ.

జనాలు రాళ్ళూ, రప్పలూ తీసుకుని హాలుకి మంగళహారతి పాడెయ్యబోతుంటే నేను 'కామ్రేడ్స్' అనరిచాను. మీరు గమనించారో లేదో - ఎత్తుమీద నిలబడి, గొంతెత్తి అరిచేవాణ్ణి మాబ్ ఆలోచన లేకుండా అనుసరిస్తుంది. నేను గోడెక్కి అలా గట్టిగా అరవగానే నన్నొక లీడరుగా గుర్తించి జనం ఆగిపోయారు. విప్లవం అయిదు నిమిషాలు వాయిదా వేసి హాల్లోకి నడవమని చెప్పాను. కిందనుంచి ఎవడో, 'ఇంక్విలాబ్....' అనరిచాడు. '.......జిందాబాద్' అని నినాదాలిస్తూ జనం హాల్లోకి పరిగెట్టారు.

> **గు**ర్నాథం పూర్వాశ్రమంలో- సంగీత దర్శకుడిగా అవతరించక ముందు - గిన్నెలకు మాట్లేసేవాడుట. సుత్తి తీసుకుని ఇంట్లో గిన్నెలు, పళ్ళేలూ, డబ్బాలూ మోగిస్తూ ట్యూన్‌లు వినిపించాడు.

మళ్ళీ హాలు చీకటవడంతో జనం నిశ్శబ్దమై పోయారు. వాళ్ళ అభిమాన తార స్నానాలగదిలోకి నడుస్తూ తన సౌందర్య రహస్యం వెల్లడించబో తుంటే ఎవడో 'వద్దు' అనరిచాడు. అది పెద్ద గోలగా మారకముందే రెండో ప్రొజెక్టరులోంచి మొదటి ట్రెయిలరు పడింది. అంతే - చీమ చిటుక్కుమన్న శబ్దం వినిపిస్తే ఒట్టు - ట్రెయిలరు తర్వాత ట్రెయిలరు - రెండేస్సార్లు చూపించి లైట్లు వెయ్యగానే జనమంతా ఈలలేస్తూ, గోలగా మేనేజరు ఆఫీసువైపుకి పరిగెట్టుకొచ్చారు.

'మళ్ళా తన్నడానికొస్తున్నారేవిటి గురూగారూ' అన్నాడు మేనేజరుగారు కంగారుగా.

'కాదు - మీకు అభినందనలు తెల్పడానికి' అన్నాను వాళ్ళ చేతుల్లో పూలదండలు చూపించి.

ఈ కథంతా వివరించి - 'ఈయన డైరెక్టు చెయ్యడం నాకిష్టం లేదు. ఈయన ఎవడికీ అర్థం కాకుండా ఫిల్ము తీస్తాడు. ఎవడికీ అర్థం కాకపోతే అది గొప్ప ఫిల్ము అని జడ్జీలు అవార్డులిచ్చేస్తారు. మనం మాత్రం క్షవరవయ్యి తిరుపతిలోనో, సింహాచలంలోనో మెట్లదగ్గర అడుక్కుతినాలి - ఆపైన మీ ఇష్టం' అన్నాను.

రమణమూర్తిగారికి, మావగారికి ఆ దృశ్యం ఆర్ట్‌ఫిల్ములో దృశ్యంలా చేదు చేదుగా అనిపించింది కాబోలు - కొంచెం కంగారు పడ్డారు. 'ఆలోచించి చెబుతాం' అని ఆర్టుఫిల్ము డైరెక్టరుగార్ని పంపించేసి, 'మరి డైరెక్షను ఎవరికిద్దాం?' అనడిగారు.

'డైరెక్టరుదేవుంది - 'ఏక్షన్', 'కట్' అనరవడం - నోట్లో విజిల్ పెట్టి ఈలెయ్యడం అంతే కదా. ఎవరో ఎందుకు - నేనే చేస్తా' అని జేబులోంచి విజిలు తీసి, నోట్లో పెట్టి, గట్టిగా ఈలేశాను. నేను అలా ఈలేశానో లేదో, మావగారూ, రమణమూర్తిగారు కళ్ళు తిరిగి ధన్‌మని కిందపడిపోయారు. ఇద్దరికీ తమాషాగా ఒకేసారి హార్టెటాక్ వచ్చిందేవిటా అని నేను ఆశ్చర్య పోతుంటే ఇద్దరూ చెరో కాలూ గట్టిగా పట్టుకున్నారు.

'పెద్దవారు మీరు నా కాళ్ళు పట్టుకోవడం నాకు ఆయుఃక్షీణం. నాకేదైనా అవుతే మన పిక్చరు మొదలుకాకుండానే ఆగిపోతుంది' అని లేవదీశాను ఇద్దర్నీ.

'నువ్వు మాకో మాటివ్వాలి' అన్నారు ఇద్దరూ ఏక కంఠంతో, దీనంగా చేతులు జోడించి నమస్కరిస్తూ. 'నువ్వు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, సంగీతం - అన్ని వ్యవహారాలు చూసి అల్సిపోయావు. నువ్వు డైరెక్టు చెయ్యలేవని గాదు. చెయ్యగలవు. కాని ఇంత బరువు నీ తల మీద పెట్టడం అంత మంచిది కాదు. మెదడు దెబ్బ తినొచ్చు. ఇంక ఈ రోజునుంచీ వ్యవహారాలన్నీ మాకొదిలేసి నువ్వు విశ్రాంతి తీసుకో. నువ్వు స్టూడియోలో అడుగు పెట్టొద్దు' అన్నారు ఇద్దరూ ప్రార్థిస్తూ.

'అడుగుపెట్టరు' అంది మా ఆవిడ కలుగజేసుకుంటూ. నన్ను ఏ హీరోయిన్నో ఎగరేసుకుపోతుందని మా ఆవిడ భయం.

'సరే. అలాగే కానివ్వండి. నిర్మాణత నేను చూస్తాను' అన్నాను.

'నిర్మాణత ఏవిటి?'

'అంటే ఏవిటో నాకూ తెలియదు. టైటిల్సులో చూస్తుంటాను. చెక్కుల మీద సంతకం చెయ్యడం అనే అర్థంలో వాడాను' అన్నాను.

మా మావగారు శబరిమలైలోనో, తిరుపతిలోనో గుండు కొట్టించి, రుద్రాక్ష మాలలు ధరించి, భక్తిశ్రద్ధలతో సినిమా నిర్మాణ కార్యక్రమం ప్రారంభించారు. నేను మాత్రం స్టూడియోలో అడుగు పెట్టలేదు. అడుగు పెట్టలేదంటే నన్ను అడుగు పెట్టనివ్వ లేదన్న మాట. దర్శకుడు, నటీనటుల ఎంపిక, నిర్మాణం అంతా మావగారూ,

రమణమూర్తిగార్లే చూశారు. నేను నిం
మాత్రం చూస్తున్నాను. మూణ్ణెల్ల తర్వాత మా
ఓ రోజు మొహం వేళ్ళాడేసుకొచ్చి, 'ఆరు
యింది' అన్నారు దిగులుగా.

మా కాలేజీ క్రికెట్టు టీంలో చిట్టివం
ఓ బాట్స్‌మన్ ఉండేవాడు. వాడి రికార్డు అ
రన్నులు. మా మావగారిది కూడా చిట్టివ
రికార్డులాగే ఉంది. ఆరు సంఖ్య దాటడం లే

'ఇప్పుడేం చేద్దాం - మన దగ్గరున్న
అయిపోయింది' అన్నారు మావగారు.

మీ ఇంట్లో అటక ఉందా?' అనడిగారు
మూర్తిగారు.

'ఉంది - ఏం' అన్నాను.

'ఈ రీళ్ళు కూడా అటకెక్కించేద్దాం.
మావ - అల్లుడికి అల్లుడు' - రమణమూర్తి
చిందులు తొక్కడం మొదలెట్టారు.

వాళ్ళ మాటలు వింటూ పరధ్యానంగా
చూస్తున్నాను. ఏదో సైన్స్ ఫిక్షన్ సీరి
వస్తోంది. విలన్ హీరోని చేటలా ఉన్న అ
నౌక ఎక్కి తరుముకొస్తుంటే, హీరో ఓ కొం
నుంచి మెల్లిమెల్లిగా తప్పించుకుపోతూ అంత
ఎగిరి పోతాడు - ఆ సీను చూస్తున్న నా
మళ్ళీ పాదరసంలా పరిగెట్టింది.

'ఐడియా' అనరిచాను.

'ఏవిటి?'

'మన సినిమాలో మాగ్నెటిక్ కొండ ఒకటుంట

'పిక్చరాగిపోయిందంటే నీకు మతి చలించలేదు కదా' అన్నారు మా
అనుమానంగా.

'మతి ఛలించేది మన సినిమా ప్రేక్షకులికి. మన సినిమాలో ఓ మా
కొండ ఉంటుంది. ఆ మాగ్నెటిక్ శక్తి కొండ దగ్గరకి వచ్చినవాళ్ళని కా
ముందుకో వెనక్కో - మన కథ అవసరాన్ని బట్టి విసిరేస్తుంది.....'

'కాపీ' అనరిచాడు టీవీ చూస్తున్న సుపుత్రుడు.

'ఏవిటి కాపీ?'

'టీవీ సీరియల్ నుంచి నాన్న కాపీ కొట్టేస్తున్నాడు.'

'మాగ్నెటిక్ కొండేవిటి - నాకేం అర్థం కావటం లేదు' అన్నారు మావగారు

'నాకూ అర్థం కావడం లేదు. అయినా ఫరవాలేదు. సినిమాలకి న
నవలలకి అర్థంపర్థం అక్కర్లేదన్నారు పెద్దలు. నా సినిమాలో హీరో ఆ
దగ్గరకు వచ్చినప్పుడు స్లోమోషన్లో చూపించి, సస్పెన్సు మ్యూజిక్ కొట్టాలి. ఆ
స్పెషల్ ఎఫెక్ట్సు. నా హీరో మీ చిత్రంలో కాంతారావుగారిలా మారిపో
మధ్యలో రమణమూర్తిగారి పౌరాణికం - నా ఆరు రీళ్ళు, మీ ఆరు
ఆయన రెండు రీళ్ళు మొత్తం 14 రీళ్ళు సినిమా పూర్తయిపోతుంది.'

'ఇది పిచ్చికి పరాకాష్ఠ' అని గంతులేశారు రమణమూర్తిగారు. మరుక్ష
అటకమీదకంటే సినిమా ఏదో విధంగా హాల్లో పడడం మంచిదనుకున్నా
'ఏడవండి' అని పెర్మిషనిచ్చేశారు.

మొత్తం మూడు కథలూ జాయిన్ చేసి, పేచ్ వర్కు చేసి, సినిమా
చేసేం. మొదటి రోజు మొదటి ఆటకి ఆడియన్సు రియాక్షన్ ఎలా ఉం
చూడ్డానికి వెళ్ళాను.

నాది రంగుల సినిమా. హీరో మోటారు సైకిలు మీద వెడుతూ, మా
కొండ దగ్గర కొచ్చి - హీరో కాంతారావుగారిలానూ, మోటారు సైకిలు గుర్రం
మారిపోయి అక్కడ నుంచి మావగారి నలుపు - తెలుపు సినిమా.
కాంతారావుగారు రాజనాలగార్ని తరుముతుంటే - మాగ్నెటిక్‌కొండ - రాజనా
కొండచాటునుంచి వస్తూ రంగుల విలన్‌గా మారిపోయి హెలికాప్టరెక్కి నమ
అడుక్కి పారిపోతారు.

మధ్యలో రమణమూర్తిగారి పౌరాణికం -

'ఆంజనేయా - నీవు కలియుగమున భూలోకమునకు బోయి దుష్ట
శిష్ట రక్షణా గావింపవలయు' అంటారు కాంతారావుగారు.

'తమరు కలియుగమున అవతరించరా ప్రభూ?'

'అవతరించము - కలియుగాంతము వరకూ మాకు కొన్ని ముఖ్య కార్యముల
అంటూ కాంతారావుగారు చిరునవ్వుతో రాజశ్రీగారి వంక అర్థవంతంగా చూ
ఆవిడ చిరుసిగ్గునభినయిస్తుంది. ఆంజనేయస్వామి అలాగే కదలకుండా నిలబ
కొంచెం కనుబొమలు ముడిచి, 'ఏమి ఆంజనేయా యోచించుచున్నావాడవు' అంటా

'కలియుగాంతము వరకు నిన్ను ఎడబాసి యుండవలెనని సందేహి
చున్నవాడ - అయినను - 'అంబుధులింకుగాక నీ నమ్మిన
నీ యాజ్ఞనతిక్రమించునే...... మీ దయ వాల గదా ఘాతముల దుర్
మదమణంచి రామరామ శ్రీరామరామ యని నీ పదాంబుజంబుల శర
వేడునట్లు జేయనే' అని ఓ పజ్యం లాగించి, 'ఇదియె బోవుచున్నవ

జైశ్రీరామ్' అంటూ రమణమూర్తిగారి సినిమానుంచి ఆంజనేయస్వామి వారు మాయమైనా సినిమాలో నీటి అడుగున విలను గుహలో ప్రవేశించి...... జనాలు మతిపోయి చూడసాగారు.

ఏ మాట కామాటే చెప్పుకోవాలి - అప్పారావుగాడి కొండగాలిపాట సూపర్ హిట్. గాయకురాలు 'లంగా - రెత్తర మావా' అన్న పదంలో 'ర'కారం మింగేసి అద్భుతంగా పాడింది. పిక్చరైజేషనూ అంత గొప్పగా ఉంది. హాల్లో గేలకి కప్పు కూలిపోతుందేమోనని భయం వేసింది కూడా.

మొదటి ఆట అయ్యాకా జనాలు ఈలలేసుకుంటూ బయటకు పరిగెట్టి రెండో ఆట క్యూలో నిలబడ్డారు.

మూడు తరాలను ఉర్రూతలూగించే సరికొత్త కథా సంవిధానంతో ఆరెస్నెమ్ వారి అపూర్వ సృష్టి 'అమృత హస్తం' అని పబ్లిసిటీ ఇచ్చాం. నిజంగా మూడు తరాల వాళ్ళూ సినిమా చూడ్డానికొచ్చారు.



పెప్సీతరం నా రంగుల సినిమా చూసి ఈలలేసి, గేలచేసి, కుర్చీలెక్కి బ్రేక్ డాన్సు చేసేది, మధ్యతరం వాళ్ళు మావగారి సినిమా చూసి - 'అసలు రాజశ్రీలాంటి అందగత్తెలు ఈ కాలంలో ఎక్కడండీ - కీళ్ళవాతం వచ్చిన వాడిలా కాళ్ళూ చేతులూ ఈడుస్తూ డాన్సు చేసే హీరో - వననకాయ డిప్ప నెత్తిమీద బోర్లించినట్టు హెయిర్ స్టైయిలు; పాంటూ, షర్టూ; ఆడో, మగో తెలియకుండా మేకప్పయి కాల్లో ముల్లు గుచ్చుకున్న కోతిలా గంతులేసే హీరోయిను ఛ..... ఛ.... శృంగారం అభినయించాలంటే రాజశ్రీయే ఉండాలి' అని యౌవనం గుర్తుకు తెచ్చుకుని ఆనందించేవారు. పౌరాణికం రాగానే తాతయ్యలు, బామ్మలు శ్రద్ధగా చూసి, రాముడో, కృష్ణుడో కనిపించినప్పుడల్లా నమస్కారాలు పెట్టేవారు - మళ్ళీ మన సినిమా రాగానే పెప్సీతరం..... సినిమా సూపర్ హిట్టయింది. ఇరవై అయిదు సెంటర్లలో రజతోత్సవాలు చేయించుకుంది.

'బుర్రున్నవాడెవడూ ఈ సినిమా చూస్తాడనుకోలేదు' అన్నారు రమణమూర్తిగారు ఆశ్చర్యంగా. 'సినిమాలు ఎవరూ బుర్రతో చూడరు - కళ్ళతో చూస్తారు' అని వివరించాను నేను.

రజతోత్సవం అయిపోయాక మా యూనిట్ అంతకీ విందు ఏర్పాటు చేశాం.

'ఎలా ఉంది మన పాట' అన్నాడు అప్పారావు విందులో మందు లాగిస్తూ. సినిమా రిలీజయ్యాక వాణ్ణి కలవడం ఇదే.

'బ్రహ్మాండంగా ఉంది - అసలు నీ పాటకే వందరోజులాడిందని నా అనుమానం.'

'అనుమానవేవిటి నీ తలకాయ - నా పాటకే ఆడింది - నే ముందే చెప్పలా - ముసలి బావురుపిల్లి ఇంకా ఛీ... ఛా... అంటోందా, డబ్బులెక్కెట్టు కొంటోందా' అని అప్పారావు మావగారి గురించి అడుగుతుంటే, 'నువ్విక్కడున్నావా - నీ కోసం అంతా వెతుకుతుంటే - త్వరగా నడు - ఫోటోలు తీయించాలి' అంటూ హడావిడిగా పరిగెట్టుకొచ్చిన మావగారు, అప్పారావుని చూసి ఉలిక్కి పడ్డారు. అప్పారావుగాడు - మైనస్ మీసాలు, ప్లస్ గుండు, ప్లస్ రుద్రాక్షమాలల మావగార్ని గుర్తు పట్టక - ఎక్కడో చూసినట్టుగా ఉందే అన్నట్లు బుర్ర గోక్కుంటూ ఆయనకేసే చూడసాగాడు.

అప్పారావు అలా బుర్ర గోక్కుంటుంటే సైలెంటుగా డిజాల్వ్ అయి పోకుండా, 'నువ్వా?' అన్నారు మావగారు దాకలా నోరు తెరిచి.

ఒలింపిక్ గేమ్సులో బాక్ జంప్ ఉందో లేదో కాని, ఉంటే మాత్రం మావగారికి గ్యారంటీగా గోల్డుమెడలొచ్చేసేది. అప్పారావుని గుర్తుపట్టి, ఆ షాక్నుంచి తేరుకున్న వెంటనే, బోదురు కప్ప బాక్ జంప్ చేసినట్టు - బోదురు కప్పలు వెనక్కి గెంతవు. ఊరికెనే ఎఫెక్టు కోసం చెప్పాను. అంతే- ఆయన పదడుగులు వెనక్కు గెంతారు. అప్పారావుగాడు ఇంకా బుర్ర గోక్కుంటూ నాకేసి తిరిగి - 'ఎవరబ్బా... ఈ మొహం ఎక్కడో చూసినట్టుగా ఉందే..... గుండు చేసిన బావురుపిల్లిలా......' బావురుపిల్లి అనగానే వాడికి కనెక్షను దొరికినట్లుంది. '..... ఈయన ..... మీ మావగారు కదూ....' అన్నాడు.

'మావగారే.'

'మరి.... రొయ్యలేవీ..... రొయ్యలు చప్పరించేసి రుద్రాక్షమాలలు తిప్పుతోందా బావురుపిల్లి.....' - మీసాలు తీసేసి, రుద్రాక్షమాలలు వేసుకుని, వేషం మార్చి తనని అంత కష్టపెట్టినందుకు అప్పారావుగాడికి మావగారిమీద తెగ కోపం వచ్చేసింది.

'ఏహేయ్' అని ఓ పొలికేక వేసి, 'మీతో ఓ మాట చెప్పాలి' అని అరుస్తూ, ఆయన వెనకాలే తరుముకుంటూ పరిగెట్టాడు అప్పారావుగాడు.

'వ....ద్దు.....' - 'ష్' మని మావగారు బాణంలా దూసుకు పోయి మాయమైపోయిన క్షణం తర్వాత ఆయన సమాధానం మెల్లిగా గాలిలో తేలుతూ వచ్చింది. ■